క్లుప్తంగా

రోగులకు మెరుగైన సేవలు అందించండి

● వైద్యులకు సబ్ కలెక్టర్ త్రివినాగ్ సూచన



డాక్టర్‌తో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ త్రివినాగ్

మార్కాపురం టౌన్: వైద్య చికిత్స కోసం రోగులకు మెరుగైన సేవలు అందించాలని వైద్యులను సబ్‌కలెక్టర్ త్రివినాగ్ ఆదేశించారు. మంగళవారం మార్కాపురం కోర్టు సెంటర్‌లోని అర్బన్ హెల్త్ సెంటర్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించిన అనంతరం రోగులతో మాట్లాడి సేవలు అందుతున్న తీరును తెలుసుకున్నారు. మందుల కొరత లేకుండా చూసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు.

పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం



హెచ్ఎంను సన్మానిస్తున్న ఎంఈఓలు

కొనకనమిట్ల: దోమల నిర్మూలన అందరి బాధ్యత అని, పరిసరాల పరిశుభ్రత పాటించడం ద్వారా వ్యాధులు దరి చేరవని గొట్లగట్టు పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ ఎస్పీ బాలయ్య పేర్కొన్నారు. మంగళవారం నాయుడుపేట గ్రామంలో సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. మలేరియా, డెంగీ జ్వరాలు ప్రబలే ప్రమాదం ఉన్నందున దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ నారాయణరెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్ జె.వెంకటేశ్వర్లు, ఏఎన్ఎం కెతూర, జ్యోతి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలికి సన్మానం

బేస్తవారిపేట: జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా అవార్డు అందుకున్న స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్ హెచ్ఎం మన్నం శ్రీదేవిని ఎంఈఓలు సీహెచ్ రమణారెడ్డి, ఎస్.మధుసూదన్ రెడ్డి, ఉపాధ్యాయులు మంగళవారం ఘనంగా సన్మానించారు. విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు హెచ్ఎం శ్రీదేవి చేస్తున్న కృషిని వక్తలు కొనియాడారు. భవిష్యత్తులో మరిన్ని అవార్డులు అందుకోవాలని ఆకాంక్షించారు.

విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలి

కంభం: టీచింగ్ ఎట్ రైట్ లెవల్ ద్వారా విద్యార్థుల్లో అంక గణిత నైపుణ్యాలను, ప్రాథమిక పఠన సామర్థ్యాలను పెంపొందించవచ్చని ఎంఈఓ-2 శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. ప్రాథమిక స్థాయి బోధన సవాళ్లతో కూడుకున్నదని, ప్రాథమిక దశలో విద్యార్థులను తీర్చిదిద్దడం ఉపాధ్యాయుల నైపుణ్యాలకు కొలమానమన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో రంగస్వామి, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న డీఎల్‌డీఓ


కొనకనమిట్ల: గ్రామ సచివాలయాల ఉద్యోగులు క్షేత్రస్థాయిలో సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని డీఎల్‌డీఓ కె.శ్రీనివాసరెడ్డి సూచించారు. మంగళవారం కొనకనమిట్ల గ్రామ సచివాలయాన్ని పరిశీలించారు. ఇంటి పన్ను బకాయిలు, అటెండెన్స్ రికార్డులు తనిఖీ చేశారు. ట్రేడ్ లైసెన్స్ బకాయిల గురించి చర్చించారు. గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపరిచేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు ఉన్నారు.

నల్లబర్లీ పొగాకు సాగుపై నిషేధం



అవగాహన కల్పిస్తున్న ఏడీఏ బాలాజీ నాయక్

మార్కాపురం: ప్రస్తుత సీజన్‌లో రైతులు నల్లబర్లీ పొగాకును సాగు చేయవద్దని వ్యవసాయశాఖ మార్కాపురం ఏడీ డి.బాలాజీనాయక్ స్పష్టం చేశారు. మంగళవారం మండలంలోని వివిధ రైతు సేవా కేంద్రాల పరిధిలో రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించి మాట్లాడారు. రసాయనిక ఎరువుల వాడకాన్ని పూర్తిగా తగ్గించి, నానో ఎరువులు వినియోగించాలని సూచించారు. పొగాకుకు బదులు ఇతర పంటలు సాగు చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఏఓ బుజ్జీబాయి, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే చంద్రశేఖర్, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు



మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చంద్రశేఖర్, మాజీ ఎమ్మెల్యేలు కేపీ నాగార్జునరెడ్డి, అన్నా రాంబాబు



పార్టీ శ్రేణులతో కలిసి ర్యాలీలో పాల్గొన్న మార్కాపురం వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి అన్నా రాంబాబు

కదిలొచ్చిన కర్షకులు

● వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో అన్నదాత పోరు విజయవంతం

మార్కాపురం/తర్లుపాడు/బేస్తవారిపేట/అర్ధవీడు:

యూరియా కొరతను తీర్చడంలో, ప్రకృతి వైపరీత్యాలతో పంట నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ మంజూరు చేయడంలో కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యంపై వైఎస్సార్ సీపీ చేపట్టిన అన్నదాత పోరుకు మార్కాపురం, యర్రగొండపాలెం, గిద్దలూరు నియోజకవర్గాల నుంచి రైతులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్, మార్కాపురం, గిద్దలూరు నియోజకవర్గాల వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జిలు, మాజీ ఎమ్మెల్యేలు అన్నా రాంబాబు, కేపీ నాగార్జునరెడ్డి నేతృత్వంలో పార్టీ శ్రేణులు మార్కాపురం సబ్ కలెక్టర్ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. తొలుత స్థానిక పాత బస్టాండ్‌లోని వైఎస్సార్ విగ్రహం, కోర్టు సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహాలకు ముఖ్య నేతలు నివాళులర్పించారు.

కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మార్కాపురం పట్టణ, మండల, తర్లుపాడు, పొదిలి, కొనకనమిట్ల అధ్యక్షులు సలీమ్, చెంచిరెడ్డి, మురారి వెంకటేశ్వర్లు, గుజ్జుల సంజీవరెడ్డి, సాని కొమ్ము శ్రీనివాసరెడ్డి, ఎంపీపీలు లక్ష్మీదేవి కృష్ణారెడ్డి, భూలక్ష్మి రామసుబ్బారెడ్డి, మురళీకృష్ణ యాదవ్, జెడ్పీ టీసీలు నారు బాపన్‌రెడ్డి, అక్కి దాసరి ఏడుకొండలు, అంగన్‌వాడీ మహిళా కార్యదర్శి ఉడుముల వరలక్ష్మమ్మ, జి.చెన్నారెడ్డి, గుజ్జుల రమణారెడ్డి, కె.నరసింహారావు, సాయి రాజేశ్వరరావు, సుబ్బారెడ్డి, జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు జి.రాజేంద్రప్రసాద్, యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి జి.శ్రీనివాసరెడ్డి, నియోజకవర్గ విద్యార్థి విభాగం కన్వీనర్ ఏలూరి సంజీవరెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు. యర్రగొండపాలెం నియోజకవర్గం నుంచి యర్రగొండపాలెం, పుల్లలచెరువు, త్రిపురాంతకం, పెద్దారవీడు, పెద్దదోర్నాల పార్టీ కన్వీనర్లు డి.వెంకటేశ్వర్లు, ఎస్ పోలిరెడ్డి, కృష్ణారెడ్డి, జీవీ రమణారెడ్డి, ముసలారెడ్డి, ఎంపీపీలు కిరణ్‌గౌడ్, ఆళ్ల ఆంజనేయరెడ్డి, బెజవాడ చిన్న గురవయ్య, జడ్పీటిసి చలమారెడ్డి, రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి ఉడుముల అరుణ, వై వెంకటేశ్వరరెడ్డి, అరుణాబాయి, జానకిరఘు, రాములు పాల్గొనగా గిద్దలూరు నియోజకవర్గం నుంచి కొమరోలు జెడ్పీటీసీ వెంకట నాయుడు, కంభం కన్వీనరు జి చెన్నారెడ్డి, స్టేట్ మైనార్టీ సెక్రటరీ గఫార్‌ఆలీఖాన్, ఎంపీపీ సీహెచ్ ఓబుల్‌రెడ్డి, గిద్దలూరు నగర పంచాయితీ అధ్యక్షులు ఎం బాలిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు బత్తుల ఓబులరావు, వంశీధర్‌రెడ్డి, బేస్తవారిపేట జెడ్పీటీసీ వెంకటరాజయ్య, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వెన్నా భాస్కర్ రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు భాజామియా, అర్ధవీడు ఎంపీపీ వెంకటరావు, వైఎస్సార్ సీపీ పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు నన్నెబోయిన రవికుమార్ యాదవ్, సర్పంచ్ కె.రామకృష్ణారెడ్డి, రాచర్ల మండల పార్టీ కన్వీనర్ సీఆర్‌ఐ మురళి, పలువురు కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే, పార్టీ ఇన్‌చార్జిల వెంట పార్టీ నాయకులు ఏఎంసీ మాజీ చైర్మన్ గొలమారి శ్రీనివాసరెడ్డి, పత్తి రవిచంద్ర, బట్టగిరి తిరుపతిరెడ్డి, రోజ్ లిడియా, ఉత్తమ్‌కుమార్, సిరాజ్, పీఎల్పీ యాదవ్, బాలాజీ సింగ్, తుమ్మా వెంకటరెడ్డి, పార్టీ కార్యదర్శి గొలమారి సత్యనారాయణరెడ్డి, విభూది సుంకన్న, సురేష్, నాగరాజు గౌడ్, నజీర్ అహ్మద్, రఫీ, సీహెచ్ కోటేశ్వరరావు, ఎం.చిన్న కోటేశ్వరరావు, సిద్ధానబీ, పావులూరి వెంకటేశ్వర్లు, మూరావత్ వెంకటేశ్వర్లు, సొసైటీ మాజీ చైర్మన్ కామసాని వెంకటేశ్వరరెడ్డి, రామిరెడ్డి, దాసయ్య, రమణారెడ్డి, భాస్కర్‌రెడ్డి, శేషయ్య, వెన్న సత్యనారాయణరెడ్డి, ఎంపీటీసీ రమేష్‌రెడ్డి, కె.సత్యనారాయణరెడ్డి, జి.వెంకటరెడ్డి, బాలయ్య, దాసరి వెంకటేశ్వర్లు, కుందురు శ్రీనివాసరెడ్డి, నల్లబోతుల కొండయ్య, వేల్పుల చెన్నారెడ్డి, భవనం రామిరెడ్డి, బొగ్గు రవిచంద్రారెడ్డి, చెన్నలక్ష్మి, ఉస్మాన్, రహ్మతుల్లా, గౌస్ మొహిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



కేపీ నాగార్జునరెడ్డితో అర్ధవీడు మండల నాయకులు



వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న అన్నా రాంబాబు, పార్టీ నాయకులు

శ్రుతిమించుతున్న మందుబాబుల ఆగడాలు



అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో ఇలా..



పంచాయతీ ఆఫీస్ ఆవరణలో..

కొనకనమిట్ల: మందు బాబుల ఆగడాలు రోజు రోజుకూ శ్రుతి మించుతున్నాయి. వైన్ షాపులు, బెల్ట్ షాపుల్లో మద్యం కొనుగోలు చేసి ఎక్కడ పడితే అక్కడ తాగేసి ఖాళీ సీసాలు, గ్లాసులు, తినుబండరాల వ్యర్థాలు వదిలేసి వెళ్తున్నారు. మండలంలోని గొట్లగట్టు గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణ, పక్కనే ఉన్న అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో, బస్టాండ్ సెంటర్లోని బస్ షెల్టర్‌లో మందుబాబుల ఆగడాలు ఎక్కువయ్యాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ కార్యాలయానికి గేటు ఏర్పాటు చేసి తాళం వేయాలని, ఎక్కడ పడితే అక్కడ మద్యం తాగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అల్లుకున్న నిర్లక్ష్యం!

బేస్తవారిపేట: మండలంలోని సలకలవీడులో ప్రాథమికోన్నత పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం పక్కన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చేతికందే ఎత్తులో ప్రమాదకరంగా ఉంది. రక్షణ కంచె లేకపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. తీగజాతి మొక్కలు ట్రాన్స్‌ఫార్మర్ నుంచి స్తంభం మీదుగా విద్యుత్ తీగలకు అల్లుకుపోయాయి. మొక్కలకు విద్యుత్ సరఫరా అయితే పరిస్థితి ఏమిటని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. విద్యుత్ శాఖ అధికారులు చర్యలు తీసుకుని పిచ్చిమొక్కలు తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



విద్యుత్ స్తంభంతోపాటు తీగలపైకి పాకిన మొక్కలు

వీధి శునకాలతో జనం బెంబేలు



ద్విచక్ర వాహనాన్ని వెంబడించేందుకు వెళ్తున్న కుక్కలు

కంభం: పట్టణంలో కుక్కలు స్వైరవిహారం చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నా పంచాయతీ అధికారులు పట్టించుకోకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మేజర్ పంచాయతీలైన కంభం, కందులాపురం, హజరత్‌గూడెం కలిసిపోయి ఉంటాయి. అనంతపురం-అమరావతి జాతీయ రహదారిపై రాత్రి పూట శునకాలు గుంపులుగా తిరుగుతూ వచ్చీపోయే వాహనదారులను వెంబడిస్తూ గాయపరుస్తున్నాయి. రైల్వేస్టేషన్, బస్టాండ్ నుంచి రాత్రి పూట ఆటోల్లో వెళ్తున్న వారిని వెంటాడుతున్నాయి. నిత్యం కంభం ప్రభుత్వ వైద్యశాలకు కుక్కకాటు బాధితులు వస్తున్నారని వైద్య సిబ్బంది సైతం చెబుతున్నారు. గతంలో కంభం పంచాయతీలో సుమారు 400 వరకు కుక్కలను పట్టించిన అధికారులు పక్క పంచాయతీలైన కందులాపురంలో ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో పరిస్థితి మళ్లీ మొదటికొచ్చింది. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి వీధి కుక్కల బారి నుంచి రక్షణ కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.



కంభం వైజంక్షన్ వద్ద హైవేపై శునకాల సమూహం

వృత్తి విద్య శిక్షణతో ఉపయోగం

గిద్దలూరు రూరల్: విద్యార్థులు విజ్ఞాన పరమైన విషయాలపై అవగాహన కలిగి ఉండాలని ఎంఈఓ నాగభూషణ్‌రెడ్డి పేర్కొన్నారు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఎనేబుల్ సర్వీసెస్ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎస్వీజేఆర్ కాలేజీలోని ఐటీఐ కళాశాలను మంగళవారం సందర్శించారు. ఎంఈఓ మాట్లాడుతూ.. విద్యార్థులు వృత్తి విద్య శిక్షణ కోర్సులు నేర్చుకోవడం వల్ల భవిష్యత్తులో ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. అన్ని రంగాల్లో ప్రావీణ్యం సాధించడం వల్ల ఉజ్వల భవిష్యత్తు సొంతం చేసుకోవచ్చని చెప్పారు. కార్యక్రమంలో ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటరమణ, ఉపాధ్యాయులు శోభన్‌బాబు, సగీర్, హసీనా, ప్రియాంక, అనూష, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈఓ నాగభూషణ్‌రెడ్డి

బాల్య వివాహాలతో అనర్థం

గిద్దలూరు రూరల్: బాల్య వివాహాలతో చిన్నారులు ఉజ్వల భవిష్యత్తును కోల్పోతారని సీడీపీఓ కె.మహిత పేర్కొన్నారు. బాల్య వివాహాలను అరికట్టేందుకు సమాజంలో ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం మిషన్ సంకల్ప కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ.. బాల్య వివాహాలతో కలిగే అనర్థాలు, పోక్సో చట్టం, న్యూట్రిషన్, చైల్డ్ హెల్ప్‌లైన్ గురించి వివరించారు. ప్రతి విద్యార్థి సమాజంపై పూర్తిగా అవగాహన కలిగి ఉండాలన్నారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బి.జ్యోతి, ఏఎస్సై జిలానీ బాషా, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీడీపీఓ మహిత

పల్లెలకు వైరల్ ఫీవర్!



కొమరోలు పీహెచ్‌సీలో జ్వరాల బాధితులు

● వైద్యశాలల చుట్టూ తిరుగుతున్న బాధితులు

కొమరోలు: వాతావరణంలో మార్పులు, పారిశుధ్య లోపం కారణంగా కొమరోలు మండలంలోని గ్రామాల్లో వైరల్ జ్వరాల బాధితులు పెరిగిపోతున్నారు. వారం రోజులక్రితం ఓ మోస్తరు వర్షాలు కురవడం, గత 3 రోజులుగా ఎండలు మండిపోతుండటంతో చిన్నా పెద్ద అనే తేడా లేకుండా వైరల్ జ్వరాల బారిన పడుతున్నారు. మండలంలో కొమరోలు, రాజుపాలెం పీహెచ్‌సీలకు రోగులు క్యూకడుతున్నారు. అధిక సంఖ్యలో జ్వరాల బాధితులు కొమరోలు, గిద్దలూరులోని ప్రైవేటు వైద్యశాలల వైపు మొగ్గు చూపుతున్నారు. కొమరోలు పీహెచ్‌సీకి రోజుకు 10 నుంచి 15 ఫీవర్ కేసులు వస్తున్నట్లు వైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. వైద్యారోగ్య శాఖ అధికారులు గ్రామాల్లో ఫీవర్ సర్వేలు చేపడితే జ్వరాల బాధితుల సంఖ్య పెరిగే అవకాశం కనిపిస్తోంది.



ఏపీ కౌంటర్ వద్ద కూర్చున్న రోగులు

బైకులు ఢీకొని నలుగురికి గాయాలు

కంభం: అనంతపురం-అమరావతి హైవే రోడ్డుపై ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్రవాహనాలు ఢీకొనడంతో నలుగురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన మంగళవారం రాత్రి స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలోని ఫ్లయ్ ఓవర్ వద్ద చోటుచేసుకుంది. వివరాలు.. స్థానిక వైజంక్షన్ సమీపంలో స్పేర్ పార్ట్స్ దుకాణ నిర్వాహకుడు రామలింగారెడ్డి కంభం నుంచి బైక్‌పై మార్కాపురం వెళ్తున్నాడు. స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలో ఫ్లయ్‌ఓవర్ దాటిన తర్వాత ఎదురుగా వస్తున్న మరో బైక్ ఢీకొట్టడంతో రామలింగారెడ్డి తలకు తీవ్రగాయాలయ్యాయి. కంభం ప్రభుత్వ వైద్యశాలలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం మార్కాపురం తరలించారు. కాగా మరో బైక్‌పై ఉన్న వెంకటరమణ, సుబ్బయ్య, నిఖిలేశ్వర్ గాయాలతో కంభం ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు.



సంఘటనా స్థలంలో పడి ఉన్న రామలింగారెడ్డి





కంభంలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు